భూవివాదం కేసులో ప్రభుత్వానికి నోటీసులు

- మల్లారెడ్డి పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలోని 82, 83 సర్వే నంబర్లల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబసభ్యులు, ఇతరులకు మధ్య తలెత్తిన భూవివాదంపై కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తాము కొనుగోలు చేసిన ఆ భూముల్లో జోక్యం చేసుకోకుండా పేట్‌బషీరాబాద్ ఏసీపీ, డీసీపీ, ఇన్‌స్పెక్టర్‌తోపాటు కుత్బుల్లాపూర్ ఎమ్మార్వోను ఆదేశించాలని కోరుతూ మల్లారెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, కుమారుడు మహేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ అనిల్ కుమార్ గురువారం విచారణ చేపట్టారు. జీడిమెట్లలోని 2.14 ఎకరాల భూమిని పిటిషనర్లు, వారి కుటుంబసభ్యులు 2011లో కొనుగోలు చేసి లీజుకు ఇచ్చినట్టు వారి తరఫు న్యాయవాది చెప్పారు. ఆ భూమి తమదేనంటూ శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ఇటీవల అక్కడ ఉన్న రేకుల షీట్లను తొలగించారని, దీంతో పిటిషనర్లకు సమాచారం ఇవ్వకుండా ఆ భూమిని ఏకపక్షంగా సర్వే చేసేందుకు ఎమ్మార్వో, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్ వచ్చారని వివరించారు. ఆ భూమి నుంచి చట్టవిరుద్ధంగా పిటిషనర్లను ఖాళీ చేయించే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. దీంతో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. కౌంటర్లు దాఖలు చేయాలని రెవెన్యూ, పోలీస్ అధికారులకు నోటీసులు జారీచేసింది. ఆ భూమికి సంబంధించి కేసుల రికార్డులను సమర్పించాలని ఆదేశించి, తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

అలీ మృతికి సంతాపం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ షేక్ మహబూబ్ అలీ శుక్రవారం గుండెపోటుతో హైదరాబాద్‌లో మృతిచెందారు. జూన్ 8న కుమార్తె పెండ్లి జరగాల్సి ఉండగా వస్త్రాలు, ఆభరణాల షాపింగ్ చేస్తూ కూకట్‌పల్లిలోని ఓ ఆభరణాల దుకాణంలో కుప్పకులారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి, మస్తాన్‌రావు దవాఖానకు వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సైబర్ నేరాలు చేయడంపై శిక్షణ

కంబోడియా కేంద్రంగా కార్యకలాపాలు

- యువతకు వలవేసి అక్రమంగా తరలింపు
- అపై కాల్‌సెంటర్ల ద్వారా వివిధ రకాల మోసాలు
- దేశవ్యాప్తంగా రోజూ సగటున 6,200 కేసులు
- ప్రభుత్వ జోక్యంతో వెనక్కి వస్తున్న యువత

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): పార్ట్‌టైమ్ జాబ్స్, లోన్ యాప్స్ పేరుతో మోసాలు.. ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ స్కామ్‌లు.. ఫెడెక్స్‌లో డ్రగ్స్ స్మగ్లింగ్ అంటూ బెదిరింపులు, సైబర్ దాడుల బారిన పడి నిత్యంత ఎంతో మంది అల్లాడుతున్నారు. ఇలాంటి నేరాలకు సంబంధించి రోజూ సగటున దేశవ్యాప్తంగా 6,200 కేసులు నమోదవుతున్నాయి. వీటిలో 85% ఆర్థిక నేరాలే. ఇందులో సగం మోసాలు ఆగ్నేయ ఆసియా దేశాల నుంచే జరుగుతున్నాయని, వాటిలో కంబోడియా అగ్రస్థానంలో ఉన్నదని ఐ4సీ (ఇండియన్ సైబర్‌క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్) గుర్తించింది. విదేశీ ఉద్యోగాల పేరుతో చాలా ఏజెన్సీలు భారత్‌లోని ఎంతో మంది నిరుద్యోగ యువతను నమ్మించి కంబోడియాకు తీసుకెళ్తున్నాయి. అనంతరం సైబర్ నేరాల్లో వారికి శిక్షణ ఇప్పించి వాట్సాప్ సందేశాలు, ఫోన్‌కాల్స్‌తో భారత్‌లోని ఎంతో మందిని మోసగిస్తున్నాయి. తద్వారా రాబట్టిన సొమ్ములో 1 శాతాన్ని ఆ సైబర్ నేరగాళ్లకు జీతంగా చెల్లిస్తున్నాయి. ఈ నేపథ్యంలో విశాఖపట్నానికి చెందిన కొందరు వారం రోజుల క్రితం కంబోడియా నుంచి తప్పించుకుని వచ్చి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఇచ్చిన సమాచారం ఆధారంగా కంబోడియా పోలీసులు పలు కన్సల్టెన్సీల నిర్వాహకులను అరెస్టు చేయడంతోపాటు విషయాన్ని భారత ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కేంద్ర హోం, విదేశీ వ్యవహారాల శాఖల అధికారులు కంబోడియా ఎంబసీతో మాట్లాడి తెలంగాణ, ఏపీకి చెందిన 360 మంది యువతను విడతలవారీగా స్వదేశానికి రప్పిస్తున్నారు.

ప్రధాన నేరాలపై గత 4 నెలల్లో అందిన ఫిర్యాదులు

మోసం	ఫిర్యాదులు	నష్టం (రూ.కోట్లలో)
ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్	62,687	222.58
ట్రేడింగ్ ఫ్రాడ్	20,043	1,420.48
ఫెడెక్స్ డిజిటల్ అరెస్ట్ స్కామ్	4,599	120.3
రొమాన్స్ అండ్ డేటింగ్	1,725	13.23

శిక్షణ ఇప్పిస్తున్నదెవరు?

హైదరాబాద్‌లోని సైబర్‌క్రైం పోలీసులు గతంలో ఎన్నో నేరాలను చేధించారు. లోన్ యాప్స్ సహా వివిధ మార్గాల్లో చైనీయులు ఈ నేరాలకు పాల్పడుతున్నట్టు గుర్తించి ఎంతో మందిని అరెస్టు చేశారు. దీంతో వారంతా తమ అడ్డాలను కంబోడియా, మయన్మార్, దుబాయ్, మలేషియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలకు మార్చి.. విదేశీ ఉద్యోగాల పేరుతో భారత యువతను అక్రమంగా తీసుకెళ్తున్నారు. కంప్యూటర్ ఉద్యోగాలంటూ కొంత జీతానికి వారితో ఒప్పందం చేసుకొంటున్నారు. ఆ తర్వాత వారికి సైబర్ నేరాలు చేయడంలో వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చి, కాల్ సెంటర్ల ద్వారా భారత్‌లోని అమాయకులను మోసగిస్తున్నారు.

సోషల్ మీడియా ద్వారానే అధిక నేరాలు

ఈ ముఠాల్లోని సభ్యులంతా సోషల్ మీడియా ద్వారానే ఎక్కువ నేరాలకు పాల్పడుతున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ తదితర ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఎంతో మందిని ఆర్థికంగా మోసగిస్తున్నారు. వీటిపై ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నేషనల్ సైబర్‌క్రైం పోర్టల్‌కు 7,40,957 ఫిర్యాదులు అందాయి. వాటిలో 46% మోసాలు ఆగ్నేయ ఆసియా దేశాల నుంచి జరిగినట్టు గుర్తించారు.

అమ్మపల్లిలో తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గుమిగూడిన ప్రజలు

అమ్మపల్లిలో తాగునీటి గోస

- 24 గంటలు గడిచినా పత్తా లేని కరెంటు
- విద్యుత్ పునరుద్ధరణలో విఫలమైన అధికారులు
- ట్యాంకర్‌తో సరఫరా చేసిన సెక్రటరీ
- నీటికోసం ఎగబడిన గ్రామస్తులు

మాగనూరు, మే 24 : తాగునీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడిన ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అమ్మపల్లిలో చోటుచేసుకున్నది. గురువారం కరెంట్ పోగా.. శుక్రవారం రాత్రి అయినా రాకపోవడంతో గ్రామస్తులు నీటికోసం తల్లడిల్లారు. 24 గంటలు గడిచినా విద్యుత్‌ను పునరుద్ధరించడంలో అధికారులు విఫలమయ్యారు. విషయం తెలుసుకున్న పంచాయతీ సెక్రటరీ శ్రీను వాటర్ ట్యాంకర్ తెప్పించారు. నీటికోసం వేచి చూస్తున్న గ్రామస్తులు ఒక్కసారిగా ట్యాంకర్ వద్ద గుమిగూడారు. కొంతమందికే నీళ్లు లభించడంతో మిగిలిన వారికి ఇబ్బందులు తప్పలేదు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో అవస్థలు పడాల్సి వస్తున్నదని గ్రామస్తులు వాపోయారు. ఈ విషయంపై ఏఈ దేవేందర్‌ను వివరణ కోరగా.. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతోవిద్యుత్ లైన్‌లో సమస్య ఉన్నదని.. పరిష్కరించే పనిలో ఉన్నామని వివరించారు.

మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వీడాలని నిరసన

మిర్యాలగూడ టౌన్, మే 24 : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌అలీ కార్యాలయ సమయంలో నిద్రపోవడంపై సమాచార హక్కు చట్టం సలహా సహాయ సమితి, సాధన సమితి ప్రతినిధులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు సరికొండ రుషికేశ్వర్‌రాజు మాట్లాడుతూ, మున్సిపల్ కమిషనర్ గురువారం టేబుల్‌పై కాళ్లు చాపి నిద్రిస్తున్న ఫొటో సోషల్ మీడియాలో రావడం దురదృష్టకరమన్నారు. కలెక్టర్, సీడీఎంఏ కమిషనర్ ఈ అంశాన్ని సుమోటోగా తీసుకొని కమిషనర్‌ను విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ సమాచార హక్కు చట్టం సాధనసమితి ప్రతినిధులు చిలుముల కొండల్, కార్తీక్‌రాజు, మచ్చ మధుకర్, మందశేఖర్, గణేశ్, అజయ్ ఉన్నారు.

మిర్యాలగూడ మున్సిపల్ కార్యాలయంలో టేబుల్‌పై కాళ్లుచాపి నిద్రపోతున్న మున్సిపల్ కమిషనర్ యూసుఫ్ అలీ

తెలంగాణ, ఏపీకి మోదీ చేసిందేమి లేదు : కూనంనేని

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర విభజన తర్వాత ఏపీ, తెలంగాణకు మోదీ ప్రభుత్వం చేసిందేమీ లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ ఒక తాచుపాములాంటిదని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత 25 మంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ చేరుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రకటించడమంటే.. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తుందని, బీజేపీ ఓడిపోతుందని అంగీకరించినట్టేనని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు కూటమికి అనుకూలంగా ఉంటాయని ధీమా వ్యక్తం చేశారు. సన్న బియ్యం పండించేందుకు అన్ని భూములకు అనుకూలంగా ఉండబోవని, అందుకే దొడ్డ బియ్యం వైపు మళ్లాల్సి వస్తుందని, దీనిని ఎలా పరిష్కరించాలనేది ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు.

జెనరేటర్లను చెక్ చేసుకోండి

- విద్యుత్ కోతల నేపథ్యంలో దవాఖానలకు ఆదేశాలు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): దవాఖానల్లో ఉన్న జెనరేటర్లు సరిగా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం ఆదేశించింది. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే వెంటనే పనిచేసేలా సిద్ధంగా ఉంచుకోవాలని సూపరింటెండెంట్లు, డైరెక్టర్లకు శుక్రవారం సర్క్యులర్ జారీ చేసింది. ఇటీవల వరంగల్ ఎంజీఎం, భువనగిరి జిల్లా దవాఖానల్లో విద్యుత్ కోతలు, జనరేటర్లు పనిచేయక రోగులు తీవ్ర అవస్థలుపడిన సంగతి తెలిసిందే. మరోసారి ఇలాంటి ఘటనలు జరుగకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది.

ఈ నెల 25, 26 తేదీలలో ఎంఎంటీఎస్ రద్దు

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ) : సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే ఆధ్వర్యంలో కొనసాగుతున్న రీ-డెవలప్‌మెంట్ పనుల కారణంగా నగరంలో ఈ నెల 25, 26న ఎంఎంటీఎస్, డెమో రైల్ సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఎస్‌సీఆర్ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఫలక్‌నుమా-సికింద్రాబాద్, మేడ్చల్-సికింద్రాబాద్, లింగంపల్లి-మేడ్చల్, హైదరాబాద్-మేడ్చల్, సికింద్రాబాద్-సిద్ధిపేట్ స్టేషన్ల మధ్య రెండు రోజుల పాటు రైళ్ల రాకపోకలు నిలుస్తాయని పేర్కొన్నారు.

ఫ్యామిలీ పెన్షన్ పత్రాల అందజేత

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): ఆర్‌అండ్‌బీ శాఖలో పనిచేస్తూ చనిపోయిన సీపీఎస్ ఉద్యోగి కుటుంబానికి సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఫ్యామిలీ పెన్షన్ పత్రాలను అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారి కుటుంబసభ్యులకు పత్రాలను అందజేశారు. కర్ణాటక తరహాలో సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్‌ను అందించాలని తీర్మానించారు. సీపీఎస్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, కోశాధికారి నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీ పిటిషన్‌పై విచారణ జూన్ 4కు వాయిదా

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): దేశంలో రిజర్వేషన్లను రద్దు చేయబోతున్నట్టు నిరాధారమైన వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై దాఖలు చేసిన ప్రైవేటు ఫిర్యాదును స్వీకరించి, విచారణ చేపట్టేలా కింది కోర్టుకు ఉత్తర్వులు జారీ చేయాలంటూ బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణను జూన్ 4కి వాయిదా వేసింది. ఇటీవల కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'జన జాతర' సభలో సీఎం రేవంత్ నిరాధార ఆరోపణలు చేశారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన ప్రైవేటు ఫిర్యాదుపై కింది కోర్టు నిర్ణయం తీసుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో వెంకటేశ్వర్లు పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి గురువారం విచారణ జరిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను రద్దు చేయనున్నదని, రాజ్యాంగాన్ని మార్చివేయబోతున్నదని కొత్తగూడెం సభలో రేవంత్ నిరాధారమైన ఆరోపణలు చేశారని, తద్వారా ప్రజల్లో అనుమానాలు రేకెత్తించారని పిటిషనర్ తరఫు న్యాయవాది వివరించారు. ఈ నేపథ్యంలో రేవంత్‌పై బీజేపీ చేసిన ఫిర్యాదుపై కింది కోర్టు తగిన ఉత్తర్వులు జారీ చేయలేదని, ఆ ఫిర్యాదుపై విచారణను సుదీర్ఘంగా జూలైకి వాయిదా వేసిందని తెలిపారు. దీనిపై పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. బీజేపీ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం లేదన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నివేదించేందుకు సమయం కావాలని ఆయన కోరడంతో.. తదుపరి విచారణను జూన్ 4కు వాయిదా పడింది.

చక్కెర అధికంగా ఉన్న ఓఆర్‌ఎస్‌తో చిన్నారులకు ముప్పు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): డీహైడ్రేషన్ చికిత్సలో చిన్నారులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ఆమోదించిన ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్‌ఎస్)ను మాత్రమే ఇవ్వాలని పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ శివరంజని సంతోష్, డాక్టర్ సురేంద్రనాథ్, డాక్టర్ కరుణ స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో లభ్యమవుతున్న వివిధ కంపెనీల ఓఆర్‌ఎస్‌లో చక్కెర స్థాయిలు అధికంగా ఉన్నాయని తెలిపారు. వాటిని పిల్లలకు తాగిస్తే ప్రాణాలు పోయే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు. డీహైడ్రేషన్‌కు గురైన పిల్లలకు చికిత్స చేయడంలో ఓఆర్‌ఎస్ పాత్రపై శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన అవగాహనా సమావేశంలో వారు మాట్లాడుతూ.. డబ్ల్యూహెచ్‌వో ఆమోదించిన ఓఆర్‌ఎస్ ద్రావణం పిల్లలకు అమృతంలా పనిచేస్తుందన్నారు. డబ్ల్యూహెచ్‌వో ఆమోదించిన ఓఆర్‌ఎస్ ద్రావణం అన్ని ప్రభుత్వ దవాఖానలతోపాటు రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, మెడికల్ షాపుల్లో లభ్యమవుతుందని తెలిపారు.

73 వేల దిగువకు పుత్తడి



న్యూఢిల్లీ, మే 24: బంగారం ధరలు మరింత తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ అంతకంతకు పడిపోవడంతో వరుసగా రెండోరోజు శుక్రవారం కూడా ధరలు దిగొచ్చాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం బంగారం ధర రూ.900 తగ్గి రూ.73 వేల దిగువకు చేరుకున్నది. చివరకు రూ.72,650 వద్ద ముగిశాయి. గురువారం పుత్తడి రూ.1,050 తగ్గిన విషయం తెలిసిందే. దీంతో గడిచిన రెండు రోజుల్లోనే రూ.2 వేల వరకు తగ్గినట్లు అయింది. పసిడితోపాటు వెండి రూ.500 దిగొచ్చి రూ.92,100గా నమోదైంది. అమెరికా ఆర్థిక గణాంకాలు అంచనావేసిన దానికంటే అధికంగా నమోదవడం, ఇప్పట్లో ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను పసిడి నుంచి ఈక్విటీలోకి తరలించడంతో ధరలు భారీగా తగ్గుతున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ వర్గాలు వెల్లడించాయి. ఈ వారంలో బంగారం ధర రూ.2,800 తగ్గినట్లు అయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 35 డాలర్లు తగ్గి 2,340 డాలర్ల వద్దకు దిగొచ్చింది.

ఐదేండ్లలో 500 బిలియన్ డాలర్లు

ఇండియా-యూఎస్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం

హైదరాబాద్, మే 24 (నమస్తే తెలంగాణ): భారత్-అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం రాబోయే ఐదేండ్లలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని యునైటెడ్ స్టేట్స్ కాన్సులర్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గ్లోబల్ అలయెన్స్, స్ట్రెంథనింగ్ ఎకనామిక్స్ బ్రిడ్జెస్' అనే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. భారత్, అమెరికాల మధ్య ఉన్న బలమైన సంబంధాలు ఏ దేశానికీ లేవని, 2001 నుండి 2023 వరకు ఇరు దేశాల మధ్య వాణిజ్యం 200 బిలియన్ డాలర్లకు పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలోనే రాబోయే ఐదేండ్లలో 500 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

23 వేల స్థాయికి నిఫ్టీ

ముంబై, మే 24: రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న స్టాక్ మార్కెట్లకు బ్రేక్ పడింది. ఎఫ్‌ఎంసీజీ, ఐటీ, హెల్త్‌కేర్ రంగ సూచీల్లో ప్రాఫిట్ బుకింగ్ జరగడంతో ప్రారంభంలో భారీగా లాభపడిన సూచీలు చివర్లో నష్టాల్లోకి జారుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు బలహీనంగా ట్రేడవడం సెంటిమెంట్‌ను నీరుగార్చింది. చమురు ధరలు నిలకడగా ఉండటంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులు కుమ్మరించడంతో భారీ నష్టాలను నియంత్రించగలిగాయి. ఇంట్రాడేలో 200 పాయింట్లకు పైగా ర్యాలీ జరిపిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 7.65 పాయింట్లు కోల్పోయి 75,410.39 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ తొలిసారిగా 23 వేల పాయింట్లను అధిగమించింది. ఒక దశలో 58.75 పాయింట్లు అందుకొని 23,026.40 రికార్డు స్థాయికి చేరుకున్న సూచీ చివరకు స్వల్పంగా 10.55 పాయింట్లు నష్టపోయి 22,957.10 వద్ద ముగిసింది.

- ఈవారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,404.45 పాయింట్లు లేదా 1.89 శాతం, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 455.10 పాయింట్లు లేదా 2 శాతం బలపడ్డాయి.
- దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.4,19,99,274.85 కోట్లు(5.05 ట్రిలియన్ డాలర్లు), ఎన్‌ఎస్‌ఈలో లిస్టైన సంస్థల విలువ రూ.416 లక్షల కోట్లు(5.01 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది.
- టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి.
- మరోవైపు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, లార్సెన్ అండ్ టుబ్రో, ఎన్‌టీపీసీ, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లకు మద్దతు లభించింది.

అదానీ పోర్ట్స్ ఇన్...విప్రో అవుట్

గౌతమ్ అదానీ గ్రూపునకు చెందిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకానమిక్ జోన్(ఏపీసెజ్)..బీఎస్‌ఈ బెంచ్‌మార్క్ ఇండెక్స్ సెన్సెక్స్‌లోకి అడుగుపెట్టబోతున్నది. వచ్చే నెల 24 నుంచి దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన విప్రో స్థానాన్ని ఏపీసెజ్ భర్తీచేయనున్నది. అలాగే టాటా గ్రూపునకు చెందిన ట్రెంట్ లిమిటెడ్ సెన్సెక్స్ 50లోకి ప్రవేశించింది. ఈ ఇండెక్స్ నుంచి దివీస్ ల్యాబ్ వైదొలిగింది.

జీసీసీ బాస్‌లకు గిరాకీ

రూ.6 కోట్ల జీతమైనా ఇస్తాం • ముందుకొస్తున్న బహుళజాతి సంస్థలు

దేశంలో ఏఐ, ఎంఎల్, ఇతరత్రా టెక్నాలజీల్లో ప్రావీణ్యానికి పెద్దపీట

విదేశాల్లోని భారతీయ అనుభవజ్ఞులనూ రప్పించేందుకు ముమ్మర ప్రయత్నాలు

న్యూఢిల్లీ, మే 24: దేశంలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) అధిపతులకు గిరాకీ భలేగా నడుస్తున్నది. ప్రధాన బహుళజాతి సంస్థలు.. తమ జీసీసీ సెంటర్లలో బాస్‌లుగా పనిచేసేవారికి భారీ ఎత్తున జీతాలిచ్చేందుకు సై అంటున్నాయి మరి. ఏటా ఏకంగా రూ.3 కోట్ల నుంచి 6 కోట్లదాకైనా ఇచ్చేందుకు వెనుకాడటం లేదిప్పుడు. పరిశ్రమ వర్గాల వివరాల ప్రకారం జీసీసీల్లో అత్యున్నత స్థాయిల్లో పనిచేసేందుకు అనుభవమున్నవారు కరువయ్యారు. ఇక భారత్‌లో జీసీసీ కార్యకలాపాలకున్న డిమాండ్ ఏ స్థాయిలో ఉన్నదో తెలిసిందే. దీంతో టాప్ ప్లేస్‌కు ఎంతైనా వెచ్చించేందుకు యాజమాన్యాలు సిద్ధపడుతున్నాయి.

గత రెండేండ్లుగా..

గత రెండేండ్ల నుంచి దేశంలో చాలావరకు జీసీసీలు వ్యూహాత్మకంగా విస్తరణ బాట పడుతున్నాయి. అయితే సరైన నాయకత్వ లోపం వీటికి ప్రధాన అడ్డంకిగా మారుతున్నది. ప్రస్తుత పోటీ మార్కెట్‌లో ఈ పరిణామం.. మొదటికే మోసం తెస్తుందేమోనన్న భయంతో టాలెంట్‌ను ఒడిసి పట్టుకునేందుకు జీతాలను క్రమేణా పెంచుతూపోతున్నాయి. చివరకు కొన్ని జీసీసీల్లో ఎండీలకు ఏటా రూ.8 కోట్లపైనే ఇస్తుండటం గమనార్హం. ఈ మేరకు ఉద్యోగుల అన్వేషణ సంస్థ ఫెనో చెప్తున్నది. కొన్ని సంస్థలైతే ఈ రంగంలో సీనియర్లకు పూర్తి స్వేచ్ఛనూ ఇస్తున్నాయన్నది. వారికి సకల సౌకర్యాలు కల్పిస్తూ నాయకత్వ లోపాలను అధిగమిస్తున్నాయని అంటున్నది. నాలుగేండ్ల క్రితం ప్రముఖ జీసీసీల్లో ఏటా రూ.4 కోట్ల వేతనం తీసుకున్న ఉద్యోగులు.. ఇప్పుడు రూ.8 కోట్ల వేతనం తీసుకుంటున్నారని, బ్యాంకింగ్, ఆర్థిక రంగాలతో ముడిపడి ఉన్న జీసీసీల్లో ఉద్యోగులు 20వేలకుపైగానే ఉన్నారని, వీటి యాజమాన్యాలు తమ జీసీసీ బాస్‌లకు రూ.8 కోట్లకుపైగా వార్షిక వేతనం ఇస్తున్నాయని ఇండస్ట్రీ వర్గాలూ పేర్కొంటున్నాయి.

దేశంలోని భారీ జీసీసీల్లో **16-18 శాతం** యాజమాన్యాలు తమ **జీసీసీ** అధిపతులకు ఏటా **రూ.3 నుంచి 6 కోట్ల** జీతాన్నైనా ఇచ్చేందుకు సిద్ధపడుతున్నాయి. రెండేండ్ల కిందటిదాకా ఇందులో **10 శాతం** కన్నా తక్కువే వేతనాలుగా వచ్చేవి.

గత **3-4 ఏండ్లలో** కొన్ని ప్రధాన **జీసీసీల్లో** వేతన ప్యాకేజీలైతే రెట్టింపై **రూ.8.5 కోట్లకు** పెరిగాయి.

కృత్రిమ మేధస్సు (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఇతరత్రా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాల్లో నైపుణ్యం ఉన్నవారిని వరిస్తున్న అధిక వేతనాలు.

ప్రతిభావంతులు, నైపుణ్యం కలిగిన అనుభవజ్ఞుల కొరత దృష్ట్యా విదేశాల్లో ఉన్న భారతీయులకూ దేశంలో పెరుగుతున్న ఆఫర్లు

> "ఏఐ, ఎంఎల్ విభాగాల్లో మారుతున్న టెక్నాలజీ నైపుణ్యాలకు అనుగుణంగా ప్రతిభావంతులు, అనుభవజ్ఞుల అవసరం ఉంటున్నది. వారిని ఎలాగైనా అందిపుచ్చుకోవడమే ఇప్పుడు దేశీయ జీసీసీల అత్యంత ప్రాధాన్యతాంశం. అందుకే పెద్ద మొత్తాల్లో జీతాలనిచ్చేందుకూ వెనుకాడటం లేదు. చివరకు విదేశాల్లో ఉన్న భారతీయ నిపుణులనూ ఇక్కడకు రప్పిస్తున్నాయి.
> *-మీనాక్షి థాకర్, ట్రాన్సెర్ట్ ఇండియా భాగస్వామి*

> "భారత్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లలో సీనియర్ ఉద్యోగుల జీతాలు పెరుగుతున్నాయి. జీసీసీల విస్తరణ దృష్ట్యా నైపుణ్యం కలిగినవారికి డిమాండ్ ఏర్పడింది. కృత్రిమ మేధస్సు, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ వంటి అంశాల్లో ఎదురయ్యే సంక్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల అన్వేషణ ఇప్పుడు పెద్ద ఎత్తున జరుగుతున్నది.
> *-జస్‌ప్రీత్ సింగ్, గ్రాంట్ థాంటర్ భారత్ భాగస్వామి*

దేశంలో రేంజ్ రోవర్ తయారీ



ముంబై, మే 24: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్‌ఆర్)..తన రేంజ్ రోవర్ కార్లను భారత్‌లో ఉత్పత్తి చేయడానికి సిద్ధమవుతున్నది. 54 ఏండ్ల చరిత్ర కలిగిన ఈ కార్లు తొలిసారిగా బ్రిటన్ బయట తయారవుతుండటం విశేషం. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ రెండు మాడళ్ల ధరలు 18-22 శాతం వరకు తగ్గనున్నాయి. రేంజ్ రోవర్ కార్లు భారత్‌లో తయారవుతుంటం ఒక అద్భుతమైన అనుభూతి, చాలా ప్రత్యేకమైన క్షణాలని టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ వ్యాఖ్యానించారు. ఇక్కడే తయారవుతుంటంతో కార్ల ధరలు తగ్గనున్నాయని, దీంతో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని వ్యాఖ్యానించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో జేఎల్‌ఆర్ 4,436 యూనిట్ల వాహనాలను విక్రయించింది. ప్రాంతీయంగా తయారవుతుండటంతో రేంజ్ రోవర్ స్పోర్ట్ కారు ధర రూ.1.9 కోట్ల నుంచి రూ.1.4 కోట్లకు దిగిరానున్నది.

వాణిజ్య

ఫ్లిప్‌కార్ట్‌లో గూగుల్ పెట్టుబడులు

న్యూఢిల్లీ, మే 24: ప్రపంచ ఇంటర్నెట్ దిగ్గజం గూగుల్.. దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌లో మైనారిటీ వాటాను కొనేందుకు సిద్ధమైంది. సంస్థ తాజాగా చేపట్టిన ఫండింగ్ రౌండ్ సందర్భంగా గూగుల్ నుంచి ఈ మేరకు ప్రతిపాదన వచ్చినట్టు శుక్రవారం గ్లోబల్ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ తెలియజేసింది. ఇరు సంస్థల ఆమోదాలు, ఇతరత్రా అనుమతులకు లోబడి ఈ లావాదేవీ ఉంటుందని చెప్పింది. ఇదిలావుంటే ఈ ఫండింగ్ రౌండ్‌లో 1 బిలియన్ డాలర్లను ఫ్లిప్‌కార్ట్ అందుకోగా, ఇందులో దాని మాతృ సంస్థ వాల్‌మార్ట్ నుంచే 600 మిలియన్ డాలర్లు వస్తున్నాయి. మరో 350 మిలియన్ డాలర్లు గూగుల్ నుంచి రాబోతున్నాయి.

ఫారెక్స్ రిజర్వులు హైజంప్

ముంబై, మే 24: విదేశీ మారకం నిల్వలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. గడిచిన వారాంతానికిగాను 4.549 బిలియన్ డాలర్లు ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి 648.7 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. వరుసగా మూడు వారాలుగా పెరుగుతూ వచ్చిన ఫారెక్స్ నిల్వలు ఏప్రిల్ 5తో వారాంతానికిగాను ఆల్‌టైం హై 648.562 బిలియన్ డాలర్లకు చేరాయి.

ఎన్‌టీపీసీ లాభం 6,490 కోట్లు

న్యూఢిల్లీ, మే 24: విద్యుత్ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థయైన ఎన్‌టీపీసీ..గత త్రైమాసికానికిగాను రూ.6,490.05 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.4,871.55 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం ఎగబాకింది. ఏడాది క్రితం రూ.44,744.96 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన సంస్థ..గత త్రైమాసికానికిగాను రూ.48,816.55 కోట్లకు ఎగబాకింది. మరోవైపు, రూ.10 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకు రూ.3.25 తుది డివిడెండ్‌ను బోర్డు ప్రకటించింది. తొలి విడుత ప్రకటించిన రూ.2.25 డివిడెండ్‌తోపాటు రెండోసారి ప్రకటించిన రూ.2.25 డివిడెండ్లు ప్రకటించిన విషయం తెలిసిందే. గడిచిన ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో మొత్తంగా 93.387 బిలియన్ యూనిట్ల(బీయూ) విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది.



750 కోట్లివ్వాలి

విలీనానికి నో చెప్పడంపై సోనీని కోరుతున్న జీ

న్యూఢిల్లీ, మే 24: విలీన ఒప్పందాన్ని రద్దు చేసినందుకుగాను సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా (ఎస్‌పీఎన్‌ఐ) నుంచి 90 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.748.7 కోట్లు) టర్మినేషన్ ఫీజును జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జెడ్‌ఈఈఎల్) కోరుతున్నది. 2021 డిసెంబర్ 22న జీ, సోనీ విలీనానికి ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. 2023 ఆగస్టు 10న ఎన్‌సీఎల్‌టీ ముంబై ధర్మాసనం సోనీ గ్రూప్ సంస్థలైన కల్వర్ మ్యాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్, బంగ్లా ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో జెడ్‌ఈఈఎల్ విలీన స్కీంకు ఆమోదం కూడా తెలిపింది. ఇది 10 బిలియన్ డాలర్ల విలువైన మీడియా సంస్థ ఏర్పాటుకు దారితీసింది. అయితే రెండేండ్ల తర్వాత ఈ ఏడాది జనవరి 22న విలీన ఒప్పందాన్ని సోనీ కార్పొరేషన్ రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. జెడ్‌ఈఈఎల్ విలీన షరతులను పాటించడం లేదని కూడా పేర్కొన్నది.